క్లుప్తంగా

అత్యాధునిక లేసిక్ శస్త్ర చికిత్స



గైగోలుపాడులో అత్యాధునిక లేసిక్ మెషిన్

కాకినాడ రూరల్: కంటి లోపాలున్న వ్యక్తులకు కళ్లజోడు లేదా కాంటాక్ట్ లెన్స్ అవసరం లేకుండా ప్రపంచాన్ని చూసేందుకు లేసిక్ ఒక ఆధునిక, సురక్షితమైన శస్త్ర చికిత్స అని ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ తేజ తెలిపారు. కాకినాడ గైగోలుపాడు వద్ద ఉన్న అంజు కంటి ఆస్పత్రిలో అత్యాధునిక లేసిక్ మెషిన్‌ను రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రపంచ స్థాయి కంటి శస్త్ర చికిత్స సాంకేతిక పరిజ్ఞానాన్ని కాకినాడలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తేజ మాట్లాడుతూ, లేసిక్ శస్త్ర చికిత్సలో అత్యాధునిక లేజర్ సాంకేతికను ఉపయోగించి కార్నియా ఆకారాన్ని కచ్చితత్వంలో మార్చి కంటి చూపు సామర్థ్యం మెరుగుపరుస్తామన్నారు. ఈ లేసిక్ మెషిన్ జర్మన్ టెక్నాలజీ, 5-డైమెన్షనల్ యాక్టివ్ ఐ-ట్రాకింగ్, ఏఐ టెక్నాలజీ కలిగి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపోర్టు సీఓఓ మురళీధర్, ధూపం సత్య, ఆస్పత్రి ఎండీ కాకర్లపూడి దేవి, ప్రొఫెసర్ మురళీకృష్ణ, పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

ప్రత్తిపాడు: గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బుగత బంగార్రాజు పిలుపునిచ్చారు. స్థానిక లిబరేషన్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్ల ద్వారా పేదలు, చిన్న వ్యాపారులు, రైతాంగం తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి, ఉద్యమం చేపట్టాలని సూచించారు. ఈ ఉద్యమాల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. పంద్రాగస్టు రోజున దేశాన్ని రక్షించడం - ప్రజాస్వామ్యాన్ని కాపాడండి - రాజ్యాంగాన్ని రక్షించండి అనే నినాదాలతో గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించాలని కార్యకర్తలకు సూచించారు. లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జున రావు, లిబరేషన్ అనుబంధ సంస్థల నాయకులు రేచుకట్ల సింహాచలం, కె.జనార్దన్, గొడుగు సత్యనారాయణ, శీలం అప్పలరాజు, మానుకొండ లచ్చబాబు, రాజాల రత్నం, పేరూరి లక్ష్మి, జక్కంపూడి రాజు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

సామర్లకోట: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి ఆదివారం స్థానిక క్రైమ్ పోలీసు స్టేషన్‌లో సీఐ అంకబాబు అందజేశారు. గత నెలలో నెల్లూరు జిల్లా కానురులో మారెళ్ల పవన్ ఐఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈ మేరకు అక్కడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆన్‌లైన్ సమాచారం మేరకు క్రైమ్ సీఐ ఫోన్‌ను రికవరీ చేసి బాధితుడు పవన్‌కు సమాచారం ఇచ్చి, సామర్లకోట పోలీస్ స్టేషన్‌లో ఫోన్‌ను అందజేశారు. ఈ మేరకు బాధితుడు సీఐకి కృతజ్ఞతలు తెలిపాడు.

పెట్టుబడి లేనట్లేనా..!

- వీధి వ్యాపారులకు కొరవడిన భరోసా
- వడ్డీ లేని రుణాల మాట మరిచిన కూటమి ప్రభుత్వం
- అధిక వడ్డీకి అప్పు తెచ్చుకుంటున్న వ్యాపారస్తులు



గాంధీనగర్‌లో పండ్లు అమ్ముకుంటున్న చిరు వ్యాపారస్తులు

బోట్‌క్లబ్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకొనే వారికి అండగా నిలిచింది. వారి వ్యాపార పెట్టుబడి కోసం రూ.10 వేలు వడ్డీ లేకుండా రుణం అందించేది. దీంతో ప్రైవేటు వ్యాపారుల నుంచి అప్పులు తెచ్చుకొనే పరిస్థితి ఉండేది కాదు. అప్పులు సక్రమంగా చెల్లించడంతో బ్యాంకులు సైతం వారికి ఇతర రుణాలు సైతం ఇచ్చేందుకు ముందుకొచ్చేవి. కానీ, కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వీధి వ్యాపారులకు భరోసా లేకుండా పోయింది. దీంతో ప్రైవేటు వ్యాపారుస్తుల నుంచి పెట్టుబడి కోసం అధిక వడ్డీలకు సొమ్ము తెస్తున్నారు. వ్యాపారంలో వచ్చిన లాభమంతా వడ్డీలు కట్టేందుకే సరిపోతుందని వాపోతున్నారు. ప్రతిరోజు రూ.500 సంపాదిస్తే దానిలో రూ.300 నుంచి 400 వడ్డీ కింద కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. వీధి వ్యాపారుల కష్టాన్ని మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి స్వయంగా పాదయాత్రలో చూసి చలించిపోయి వారికి వడ్డీ లేకుండా రుణం అందించారు. కాకినాడ నగరంలో 8వేల మంది వీధి వ్యాపారులకు ప్రతి ఏటా రుణాలు అందించారు. గత ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం ద్వారా లబ్ధిచేకూరే విధంగా వాలంటీర్ల సాయంతో వీరికి రుణాలు అందించే ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం బ్యాంకులు వీరికి ఎటువంటి రుణాలు మంజూరు చేయడం లేదు. వీధి వ్యాపారులకు ఇచ్చే రుణాలుకు సంబంధించిన వడ్డీ ప్రభుత్వం ఆయా బ్యాంకులకు చెల్లించేది. దీంతో బ్యాంకులు సైతం వీధి వ్యాపారులకు రుణాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చేవారు. ప్రస్తుతం బ్యాంకులకు వీధి వ్యాపారుల రుణాలు విషయంతో ప్రభుత్వం ఎలాంటి మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో వడ్డీ లేని రుణాలు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో వారు ప్రైవేటు వ్యాపారస్తుల వద్ద అప్పులు తెచ్చి వ్యాపారాలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

వీధి వ్యాపారస్తుల పథకం కొనసాగించాలి

వడ్డీలేని రుణంతో వీధి వ్యాపారులకు గత ప్రభుత్వం జగనన్నతోడు పథకంతో ఎంతో అండగా నిలిచింది. అటువంటి పథకం కొనసాగించాలని వీధి వ్యాపారులు కోరుతున్నారు. ఈ పథకం ఎన్నో చిరు వ్యాపారుల కుటుంబాలకు అండగా ఉంది. అటువంటి పథకం ప్రస్తుతం నీలినీడలు కమ్ముకోవడంతో వ్యాపారస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకం ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనసాగించాలని కోరుతున్నారు. ఈ పథకం కొనసాగించకుంటే వీధి వ్యాపారుస్తులు రోడ్డున పడే పరిస్థితి నెలకొందని పలువురు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏడాది గడిచినా పథకం ఊసెత్తని కూటమి ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూరయ్యిందని పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకుంటుందే తప్ప వీధి వ్యాపారులకు చేసిందేమి లేదు. కాకినాడ నగరంలో వేలల్లో ఉన్న వీధి వ్యాపారులకు కనీసం ఒక్క రూపాయి కూడా రుణం ఇచ్చిన పాపాన పోలేదు. 14 నెలలు గడుస్తున్నా వీధి వ్యాపారుల కోసం ఏ పథకంలో కూడా రుణాలు ఇచ్చిన దాఖలాలు లేవు. కనీసం పాత పథకాన్ని అయినా కొనసాగించాలని వారు కోరుతున్నారు.

రుణం అండగా నిలిచింది



గత ప్రభుత్వం అండగా నిలిచి వడ్డీ లేకుండా రుణం ఇవ్వడం మాకు ఎంతో ఆసరాగా ఉండేది. ఇచ్చిన రుణంలో పండ్లు కొనుగోలు చేసుకొని ప్రతిరోజు విక్రయించడంతో వచ్చిన డబ్బులు ఇంటికి తీసుకెళ్లేవాళ్లం. ప్రస్తుతం బ్యాంకుల్లో వడ్డీ లేని రుణాలు ఇవ్వడం లేదు. దీంతో బయట వ్యాపారస్తుల వద్ద అప్పులు తెచ్చుకోవాల్సి వస్తోంది. వడ్డీ లేకుండా రుణాలు ఇచ్చే పథకం కొనసాగించాలి.

– దుగ్గన వెంకన్న, కొబ్బరి బొండాల వ్యాపారి

ఆలయ శిఖరం పునఃప్రతిష్ఠ

కరప: మండలం కొంగోడులో అతిపురాతనమైన వేంకటేశ్వర స్వామి ఆలయ శిఖరం శిథిలమవ్వడంతో భక్తులు, ధర్మకర్తలు ఇచ్చిన విరాళాలతో కలశం, శిఖరం చేయించారు. ఆలయంలో ఆదివారం వేదపండితుల బృందం స్వామి అమ్మవార్లను అలంకరించి హోమం, అర్చనలు వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ధర్మకర్త చెలంకూరి ఫణీంద్ర దంపతులతో కలశం, శిఖరాలకు ప్రత్యేక పూజలు చేసి పునఃప్రతిష్ఠించారు. గ్రామంలోని మహిళలు తరలివచ్చి ప్రతిష్ఠించిన శిఖరంపై బూరెలు వేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేడిశెట్టి సుబ్బరాజు, లిఫ్ట్ ఇరిగేషన్ అధ్యక్షుడు మేడిశెట్టి వీరభద్రవెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాతో పటిష్ట నిఘా

రౌతులపూడి: గ్రామీణ ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఉండేందుకు డ్రోన్ కెమెరాలతో పటిష్ట నిఘాను ఏర్పాటు చేసినట్లు రౌతులపూడి ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ట్రయల్ రన్‌గా ఆదివారం రౌతులపూడి పరిసర ప్రాంతాలైన ఏలేరు కాలువ, శివాలయం వెనుక ప్రాంతం, గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాల్లో డ్రోన్ కెమెరాను ఎగుర వేసి గస్తీ నిర్వహించారు. ఈ డ్రోన్ ద్వారా అసాంఘిక శక్తుల, అక్రమార్కులపై నిఘా పెడుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే డ్రోన్ ద్వారా గుర్తించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అనుమతుల పునరుద్ధరణ

కాకినాడ క్రైం: ఎట్టకేలకు ఆర్ఎంసీ మైదానంలో వాకర్స్ అనుమతులు ఆదివారం పునరుద్ధరించారు. రాజ్యసభ ఎంపీ సతీష్ బాబు సహా ఎమ్మెల్సీ రాజశేఖర్, కర్రి పద్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే వర్మ, పిల్లి అనంతలక్ష్మి, పలువురు నాయకులు, ఆర్ఎంసీ పీడీ లక్ష్మణరావు తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, మైదానం అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామని అన్నారు. కళాశాల నిబంధనలకు లోబడి వాకింగ్ చేయాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఐడీ కార్డులు ఇవ్వాలని యాజమాన్యం నిర్ణయించిందన్నారు. అనుమతులివ్వాలని కోరే క్రమంలో ప్రిన్సిపాల్ సహా అధికారులతో కఠినంగా వ్యవహరించానని చెబుతూ విష్ణువర్ధన్‌కు క్షమాపణలు చెప్పారు.

200 మందికి సరిపోయే చోట 400 మందికి

వాకర్స్‌కి ఐడీ కార్డులివ్వాలని కళాశాల యాజమాన్యం నిర్ణయించింది. అయితే సుమారు 14 ఎకరాల విస్తీర్ణంలో 3-4 గజాల వెడల్పు, సుమారు ఒక కిలోమీటరు నడక మార్గంతో ఉన్న ఆర్ఎంసీ వాకింగ్ ట్రాక్‌లో కేవలం మూడు గంటల వ్యవధిలో 200 మంది వరకు అనుకూలంగా నడిచే అవకాశం ఉంటుంది. అటువంటి చోట రాజకీయ ఒత్తిళ్లు, సిఫార్సుల నేపథ్యంలో 400 మందికి అనుమతి ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. 500 మందికి పైగా దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులు, ఐడీ కార్డుల తయారీ వ్యయం అంతా రంగరాయ ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ వ్యక్తిగతంగా భరిస్తున్నారు. ఆదివారం పునఃప్రారంభ వేదికగా కొందరికి ఐడీ కార్డులు అందజేశారు.

ఇవీ నిబంధనలు..

గతం తాలూక గాయాల నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రంగరాయ యాజమాన్యం తగిన జాగ్రత్తలు తీసుకుంది. వాకింగ్ కోసం నిబంధనలతో కూడిన అనుమతులిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అనుమతులు పొందిన వాకర్ కళాశాల నిబంధనలకు లోబడటంతోపాటు అంతకుముందు డిక్లరేషన్ సమర్పించాల్సి ఉంటుంది. సదరు నిబంధనలు అనుసరించి

- వాకర్ వయసు కనీసం 40 ఏళ్లకుపైన ఉండాలి
- బయటి వ్యక్తులకు వాకింగ్‌కు తప్ప క్రీడలకు అనుమతి లేదు
- కుల, మత, రాజకీయ సమావేశాలకు గ్రౌండ్‌ను వినియోగించకూడదు
- ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ, సెలవుల్లో ఆహ్లాదానికి అనుమతి లేదు
- ఐడీ కార్డుతోనే వాకర్స్ రావాలి. ఐడీ చూపించకుంటే ప్రవేశానికి అనుమతి ఇవ్వరు
- ఉదయం 5 నుంచి 8 మధ్య, మూడు గంటల వ్యవధిలో మాత్రమే అనుమతి
- కళాశాల కార్యక్రమాలు, వర్షాల వేళ ప్రవేశానికి అనుమతి లేదు
- జాగింగ్, రన్నింగ్, ఫిట్నెస్ ట్రెనింగ్‌లు, గ్రూప్ వర్కఅవుట్‌లకు అనుమతి ఇవ్వరు
- గ్రౌండ్‌లో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ పూర్తిగా నిషేధం
- రక్తదానాలు, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలకు అనుమతి లేదు
- మైదానంలో ధూమపానం, మద్యపానం పూర్తిగా నిషిద్ధం
- అసోసియేషన్ల పేరుతో నిర్వహించే ఎలాంటి కార్యక్రమాలను అంగీకరించరు
- గ్రౌండ్‌లో పారిశుధ్య నిర్వహణ వాకర్ వ్యక్తిగత బాధ్యత, ఇది తప్పనిసరి.

వీటన్నింటినీ అంగీకరిస్తూ వాకర్ తన డిక్లరేషన్ సమర్పించాల్సి ఉంటుంది. నిబంధనలకు విరుద్ధంగా ఏ వాకర్ ప్రవర్తించినా వారి అనుమతిని పూర్తిగా రద్దు చేసే అవకాశం కళాశాల యాజమాన్యానికి ఉంటుంది.

రెండో రోజూ కొనసాగిన వర్క్ షాపు



ఐడీపీ వర్క్‌షాపు నిర్వహించిన దృశ్యం

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకేలో ఐక్యూఏసీ కెపాసిటీ బిల్డింగ్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇన్‌స్టిట్యూట్ డెవలప్‌మెంట్ ప్లాన్ (ఐడీపీ) వర్క్ షాపు రెండో రోజు ఆదివారం కొనసాగింది. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కశ్మీర్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రవీంద్రనాథ్ ఔట్‌లైన్ పర్ డెవలపింగ్ ఐడీపీ ఇంప్లిమెంటేషన్ స్ట్రాటజీస్ అంశంపై వివరించారు. ప్రొఫెసర్ రవీంద్రనాథ్, గౌరీదత్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఆఫ్ ఐడీపీ సెల్ అంశంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్, రెక్టార్ వీవీ సుబ్బారావు, రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, డైరెక్టర్ బాలాజీ పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం

కరప: గ్రామ సమీపంలో బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఒకరికి తీవ్రగాయాలు, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను చికిత్స కోసం కాకినాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. స్థానికులు, బాధితుల వివరాల మేరకు.. పెదపూడి మండలం జి.మామిడాడకి చెందిన వెంకన్నబాబు, సత్యనారాయణ బైక్‌పై కాకినాడ వెళ్లేందుకు బయలుదేరారు. కరప, పెనుగుదురు గ్రామాల మధ్య కాకినాడ నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం వారిని ఢీకొట్టింది. అటుగా వస్తున్న నలుగురు యువకులు స్పందించి వారిని ఆస్పత్రికి తరలించారు.



క్షతగాత్రులను అంబులెన్సులోకి ఎక్కిస్తున్న సిబ్బంది

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన ఉండాలి



యండమూరులో విద్యార్థులకు ఉపకరణాలు అందజేస్తున్న సత్యనారాయణ

కరప: విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, అవి సాధించేందుకు నిరంతర కృషి అవసరమని కడియం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి.సత్యనారాయణ పేర్కొన్నారు. విద్యార్థులు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. మండలంలోని యండమూరులో అంబేద్కర్ భవనంలో ఆదివారం ఆస్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన కెరీర్ గైడెన్స్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు తమ శక్తిసామర్థ్యాలు, ఐక్యూను బట్టి భవిష్యత్‌లో ఏం చదవాలో, ఏ ఉద్యోగంలో చేరాలో తెలియక వెనుకబడి పోతున్నారన్నారు. అంబేద్కర్ సేవా కేంద్రం చైర్మన్ గుబ్బల రాంబాబు స్వచ్ఛందంగా పదవీ విరమణ చేసి, గ్రామీణ ప్రాంత యువతను చైతన్యపరుస్తూ.. కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఆస్క్ సేవలు అభినందనీయమన్నారు. తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు పిల్లలు క్రమశిక్షణతో విద్యనభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా 100 మంది విద్యార్థులకు డిక్షనరీలు, నోట్ బుక్స్, తదితర విద్యా ఉపకరణాలను అందజేశారు. విశ్రాంత పోలీస్ అధికారి చంద్రరావు, ఆస్క్ డైరెక్టర్ మారెళ్ల శ్రీనివాసరావు, ఎఫ్‌సీఐ ఉద్యోగిని శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

సూర్యభగవానుడికి వెండి గద సమర్పణ

బోట్‌క్లబ్: స్థానిక భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న సూర్యభగవానుడికి ఆదివారం నగరానికి చెందిన 10 మంది దాతలు, వెండి గద, శంఖం బహుకరించారు. సుమారు రూ.2 లక్షలు విలువ చేసే ఈ వస్తువులను ఆలయ ఈఓ, అర్చకుడుకి అందజేశారు. అనంతరం వాటికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

బాలాజీచెరువు: పర్యావరణ పరిరక్షణకు ఆల్‌ఈజ్‌వెల్ స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తుందని సంస్థ సభ్యుడు అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో ఆదివారం సభ్యుల సహకారంతో మొక్కలను సంరక్షించే కార్యక్రమం చేపట్టారు. ముందుగా వర్సిటీ అతిథి గృహం వద్ద మొక్కలను పరిశుభ్రం చేసి వాటి చుట్టూ సుందరీకరణ పనులు చేపట్టారు. పర్యావరణ పరిరక్షణ ద్వారా కాలుష్యాన్ని నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడటంలో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌యస్‌యస్ ఉమ్మడి జిల్లా మాజీ కో-ఆర్డినేటర్ పాతూరి వెంకట కృష్ణారావు, పీఆర్ డిగ్రీ కళాశాల రిటైర్డ్ పీడీ వెంకటస్వామి, ఆల్‌ఈజీవెల్ సభ్యులు కిషోర్, సుబ్బారావు పాల్గొన్నారు.



సుందరీకరణ చేస్తున్న ఆల్‌ఈజీవెల్ సభ్యులు

విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆందోళన



చేబ్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో కొన్ని రోజులుగా అప్రకటిత కరెంటు కోతలు విధించడంపై గ్రామస్తుల ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ కోతలకు నిరసనగా చేబ్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆదివారం రాత్రి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, శనివారం రాత్రి కరెంటు తీసేసి తీవ్ర ఇబ్బందులు గురిచేశారని మండిపడ్డారు. అలాగే ఆదివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 10 అయినా కరెంటు పునరుద్ధరణ చేయకపోగా.. అధికారులు స్పందించట్లేదని పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సూరిశెట్టి జయకృష్ణ తదితరులు విద్యుత్ శాఖ ఉద్యోగులపై మండిపడ్డారు. గ్రామాలకు విద్యుత్ సరఫరాను ఇష్టమొచ్చినట్లుగా నిలిపివేస్తున్న అధికారులు పరిశ్రమలకు మాత్రం నిరాటంకంగా సరఫరా ఇస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ శాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా ప్రవర్తిస్తున్నారన్నారు. పెద్ద సంఖ్యలో చేబ్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద గ్రామస్తులు భైఠాయించి సరఫరాను పునరుద్ధరించే వరకు కదలమంటూ నినాదాలు చేశారు. పరిశ్రమలకు కావాలనే విద్యుత్ సరఫరా చేస్తూ అధికారులు సొమ్ములు దండుకుంటున్నారని ఆరోపించారు. అప్రకటిత విద్యుత్ కోతలు ఆపకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని వారు హెచ్చరించారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి సారించకపోతే సహించమన్నారు. గత కొన్నేళ్లలో ఎప్పుడు ఇలాంటి కోతలు చూడలేదని కూటమి ప్రభుత్వం వచ్చాకా కోతలు విధిస్తున్నారని ఆరోపించారు.

మురారిలో పోలీస్ బీట్ ఏర్పాటు

గండేపల్లి: మండలంలోని మురారిలో వేంచేసిన కనకదుర్గమ్మ సన్నిధి ప్రాంతంలో పోలీస్ బీట్ ఏర్పాటు చేస్తున్నట్టు సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. ప్రతి ఆదివారం అమ్మవారి దర్శనానికి ప్రాంతాల నుంచి వస్తున్న భక్తుల సౌకర్యార్థం ఆ ప్రాంతంలో జూద క్రీడలు, దొంగతనాలకు తావు లేకుండా, ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా సిబ్బంది గస్తీ నిర్వహిస్తారన్నారు. మురారిలో ఆదివారం బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదు, పొగ తాగరాదు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకూడదు తదితర నినాదాలతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

ఫ్లైఓవర్‌ను.. పట్టించుకోరా!

- ప్రమాదపు అంచున ఫ్లైఓవర్‌ను బ్రిడ్జి రోడ్డు
- అడుగడుగునా గోతులు
- పట్టించుకోని అధికారులు



పెద్దాపురం ఏడీబీ రోడ్డు నుంచి ఫ్లైఓవర్ ఎక్కే మార్గంలో గోతులు



గోతులతో ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి

సామర్లకోట: ప్రభుత్వాలు మారుతున్నా రోడ్ల పరిస్థితి మాత్రం మారట్లేదు. ఎన్నికల సమయంలో హామీలు గుప్పించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంతలకు మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటుందనే ఆరోపణలున్నాయి. ప్రధాన రహదారులు సైతం గుంతలతో ఛిద్రంగా ఉన్నాయి. ఈ రోడ్లపై ప్రయాణం చేయాలంటే భయంగా ఉంటుందని వాహనచోదకులు ఆవేదన చెందుతున్నారు. సామర్లకోట పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై అడుగడుగునా గోతులు ఉండటంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధాన పట్టణాలైన రాజమహేంద్రవరం, రాజానగరం, పెద్దాపురం, సామర్లకోట, ఏలేశ్వరం, జగ్గంపేట నుంచి రాకపోకలు సాగించే వారు తప్పనిసరిగా ఈ ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచే రాకపోకలు సాగించాలి. మరో మార్గం లేకపోవడంతో ఫ్లైఓవర్ బ్రిడ్జి మాత్రమే వాహనచోదకులకు మార్గంగా ఉంది. స్థానిక గాంధీచౌక్ సమీపంలో రైల్వే గేటు మీదుగా కాకినాడ వెళ్లడానికి అవకాశం ఉంది. అయితే ఆ రోడ్డులో గేటు తీసిన సమయంలో రైల్వే గేటు వద్ద ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని భావించిన పోలీసులు గేటు మీదుగా బైక్‌లు మాత్రమే వెళ్లేందుకు డివైడర్లు ఏర్పాటు చేశారు. దీంతో భారీ వాహనాలు వెళ్లేందుకు ఫ్లైఓవర్ బ్రిడ్జి ఒక్కటే మార్గం కావడంతో నిత్యం ఈ బ్రిడ్జి రద్దీగా ఉంటుంది. రాజమహేంద్రవరం రోడ్డులో ఉన్న ఇంజినీరింగ్, మెడికల్ కార్పొరేట్ కళాశాలలకు వెళ్లే వాహనాలతో మరింత రద్దీగా మారింది. దీనికి తోడు పెద్దాపురం ఏడీబీ రోడ్డు నుంచి కాకినాడ పోర్టుకు పెద్దపెద్ద కంటైనర్లు వెళుతుంటాయి. సామర్లకోట– పెద్దాపురం ఏడీబీ రోడ్డు ఇండస్ట్రీయల్ ఏరియాగా గుర్తింపు పొందడంతో ఫ్లైఓవర్ బ్రిడ్జిపై తరుచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది.

ఎక్కి దిగే వరకు భయం.. భయం

పెద్దాపురం ఏడీబీ రోడ్డు నుంచి కాకినాడ రోడ్డులో ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగే వరకు భయం భయంగా ప్రయాణం చేయాల్సి వస్తోందని వాహనచోదకులు వాపోతున్నారు. పాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉండే ఏడీబీ రోడ్డు(ఫ్లైఓవర్ బ్రిడ్జి ఎక్కే ప్రదేశం)లో పెద్ద పెద్ద గోతులు పడి ఉండటంతో భారీ వాహనాలతోపాటు ఆటోలు, బైక్‌లు పాడైపోతున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి దిగే సమయంలో గోతులు కనిపించకపోవడంతో చిన్న వాహనచోదకులు ప్రమాదాల్లో చిక్కుకుంటున్నారు. ఇక పెద్దాపురం ఏడీబీ రోడ్డు నుంచి వేగంగా వచ్చే వాహనాలు ఫ్లైఓవర్ బ్రిడ్జి ఎక్కే సమయంలో గోతులను గమనించక ఒక్కసారిగా బ్రేక్‌లు వేయడంతో గత మూడు రోజులుగా కురుస్తున్న చినుకులకు రోడ్డుపై వాహనాలు జారిపోతూ ప్రమాదాల నుంచి తప్పించుకొంటున్నారు. పెద్ద వాహనాల డ్రైవర్లు గోతులను తప్పించడానికి రోడ్డు మార్జిన్ నుంచి రావడం వల్ల రోడ్డు దాటే చిన్న వాహనచోదకులు భయం గుప్పెట్లో ఉంటున్నా రు. ఇప్పటికే ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు మూడు పర్యాయాలు, అచ్చంపేట నుంచి పెద్దాపురం ఏడీబీ రోడ్డు వరకు నిర్మాణం అవుతున్న కాంట్రాక్టర్ సహకారంతో ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గోతులను పూడ్చించారు. ఈ గోతులను పూడ్చే బాధ్యత ఆర్అండ్‌బీ అధికారులపై ఉన్నా వారి నుంచి స్పందన కనిపించడం లేదు. సామర్లకోట నుంచి కాకినాడ రోడ్డులోని గోతులను సక్రమంగా పూడ్చకపోవడం వల్ల చిన్న వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

వాహనచోదకులకు ఇబ్బంది



నిత్యం ఎంతో రద్దీగా ఉండే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై అడుగడుగునా గోతులు ఏర్పడ్డాయి. దాంతో చిన్న వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెనపై వాహనాల రాకపోకలతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. గోతులతో ఈ సమస్య మరింత పెరుగుతుంది. ఫ్లైఓవర్ బ్రిడ్జి ముఖ్యకూడలి ప్రదేశాల్లో ఉన్న రైలింగ్ కూలిపోయి ప్రమాదకరంగా ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడం ఆశ్చర్యంగా ఉంది.

– గంగాధర్, జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత, సామర్లకోట.

మెయింటెనెన్స్ నిధులు విడుదల కావాల్సి ఉంది



ఫ్లైఓవర్ బ్రిడ్జిపై కూలిన రైలింగ్‌ను గమనించాం . మెయింటె నిధులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. అదే విధంగా ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గోతులు పూడ్చడంతోపాటు రోడ్డు నిర్మాణానికి ప్రణాళికలను తయారు చేశాం. వర్షాలు తగ్గిన తరువాత రోడ్డు పనులు ప్రారంభిస్తాం.

– నరసయ్య, ఆర్అండ్‌బీ డీఈ, కాకినాడ